ప్రజాశక్తి
ఆదివారం 5 మార్చి 2023 5
పార్వతీపురం మన్యం



6న జాబ్ మేళా

పార్వతీపురం టౌన్ : నెల్లూరు జిల్లా శ్రీ సిటీలో గల క్యాడ్బరీ చాక్లెట్ కంపెనీ ఈనెల 6న పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనుందని కళాశాల కరస్పాండెంట్ పివికె మణికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలలో కేవలం మహిళలకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి ప్రయత్నంలోనే 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, 18 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి రూ. 2 లక్షలు ఇతర ఆలవెన్స్‌తో కూడిన వేతనం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలియజేసినట్లు చెప్పారు. జాబ్ మేళాలో పాల్గొనే మహిళలు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సోమవారం ఉదయం 8.30 గంటలకు గాయత్రి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హాజరు కావాలని తెలిపారు.

మన్యం జిల్లాకు పరిశ్రమలొచ్చేనా?



- అటవీ, వ్యవసాయ ఉత్పత్తులతో అపారమైన అవకాశాలు
- డిప్యూటీ సిఎం చొరవ చూపుతారా?
- గ్లోబల్ సమ్మిట్‌పై కొత్త ఆశలు

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి ఏడాది కూడా కాలేదు. ఈనెల 3,4తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతం కావడంతో మన్యం జిల్లాలో పరిశ్రమలేమైనా ఏర్పాటవుతాయా అని యువత ఎదురు చూస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావడం, రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూలు కుదిరినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మన్యం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మేరకు చొరవ చూపుతారనే చర్చ మొదలైంది. మన్యం జిల్లాలో లభించే అటవీ వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమలు స్థాపించాలని ఈ ప్రాంత రైతులు, యువకులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా పార్వతీపురం మన్యం జిల్లా. ఈ జిల్లాలో గల 15మండలాల్లో గిరిజన జనాభా అధికం. ఏజెన్సీ ప్రాంతం కావడంతో అటవీ ఉత్పత్తుల సేకరణ ఎక్కువగా ఉంటుంది. గిరిజనులు ఏడాది పొడవునా నమ్ముకున్న అడవితల్లి ఒడిలో సేదతీరుతూ రకరకాల ఉత్పత్తులను సేకరించి విక్రయిస్తారు. వీటిలో ప్రధానమైన ఉత్పత్తులు చింతపండు, జీడిపిక్కలు. మన్యం జిల్లాలో ఉన్న రెండు ఐటిడిఎల పరిధిలో గిరిజనులు అధికంగా జీడితోటల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. అడవుల్లో సహజసిద్ధంగా పెరిగిన చింత చెట్ల నుంచి చింత పండును సేకరించి విక్రయాలు చేస్తారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయినా గిరిజనుల జీవితాల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో గల గిరిజన మండలాలను కలిపి పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పాటు చేశారు. మన్యం జిల్లాలో అపారమైన ఖనిజ సంపదతో పాటు పుష్కలంగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు లభిస్తాయి. ఈ ఉత్పత్తుల ఆధారంగా ఏవైనా పరిశ్రమలు స్థాపిస్తే గిరిజన ఉత్పత్తుల కు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించడానికి అవకాశం కలుగుతుంది. ప్రస్తుత సీజన్‌లో ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా చింతపండు ఉత్పత్తి జరుగుతోంది. ఒకప్పుడు అటవీఉత్పత్తుల సేకరణపై గిరిజన సహకార సంస్థకి గుత్తాధిపత్యం ఉన్నందున గిరిజనులు సేకరించిన ఉత్పత్తులను జిసిసికే విక్రయించే వారు. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అటవీ ఉత్పత్తులపై గుత్తాధిపత్యం లేకుండా చేయడంతో గిరిజనులు తాము సేకరించిన ఉత్పత్తులను నచ్చిన చోట, నచ్చిన వ్యాపారులకు విక్రయించుకునే అవకాశం లభించింది. గుత్తాధిపత్యం ఉన్న సమయంలో జిసిసి మాత్రమే చింతపండును కొనుగోలు చేసేది. గత కొన్నేళ్లుగా జిసిసి నామమాత్రపు కొనుగోళ్లకే పరిమితమవుతోంది. దీంతో చింతపండు ఎక్కువగా వ్యాపారులకే విక్రయిస్తున్నారు. జీడి పిక్కల ఉత్పత్తి కూడా మన్యం జిల్లాలో ఎక్కువగా ఉంటుంది. గిరిజనులు ఉత్పత్తి చేసిన జీడిపిక్కలకు కూడా తగిన గిట్టుబాటు ధర లభించడంలేదు. ఈ పంటను కూడా ఎక్కువగా వ్యాపారులే కొనుగోలు చేస్తారు. ప్రయివేటు వ్యాపారుల తూనికల్లో గిరిజనులు మోసపోతూ నష్టపోతుంటారు. వీటిపై ప్రభుత్వ అధికారుల నియంత్రణ, పర్యవేక్షణ కొరవడడంతో గిరిజనులు నష్టపోతున్నారు.

మన్యం మంత్రి దృష్టి పెడతారా?

జిల్లాలో చింతపండు, జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. అలాగే ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంట కూడా ఎక్కువగా సాగవుతోంది. దీంతో పశువుల దాణా తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయొచ్చు. వీటితో పాటు మన్యం జిల్లాలో సహజసిద్ధంగా లభించే ఖనిజ సంపద ఆధారంగా కూడా పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి. ఒడిశా, ఆంధ్రా మధ్య వివాదాస్పద కొటియా గ్రామాల్లో పుష్కలంగా ఖనిజ సంపద వుంది. మాంగనీస్, బాక్సైట్, గ్రానైట్ వంటి ఖనిజాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. మన్యం జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌ను ఎత్తివేసే ఆలోచన లేదు

వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్



రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డిఆర్ఎం అనూప్ కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అమృత్‌భారత్ పథకంలో భాగంగా ఎంపికైన స్థానిక టౌన్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి ప్రయాణీకులకు అధునాతనమైన సౌకర్యాలు అందించే ఆలోచనే తప్ప స్టేషన్‌ను ఎత్తివేసే ప్రతిపాదనలేవీలేవని వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ శతపతి అన్నారు. శనివారం పార్వతీపురం (బెలగాం) స్టేషన్‌లో జరుగుతున్న మూడో లైన్ పనులతో పాటు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఆయన్ను తొలుత మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు టిడిపి శ్రేణులతో కలిసి టౌన్‌స్టేషన్ ఎప్పటిలాగే కొనసాగించాలని వినతిని అందించారు. అనంతరం జనసేన, వినియోగదారుల సంఘం నాయకులు కలిసి ఈ మేరకు వినతి అందించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు డిఆర్ఎంను కలిసి టౌన్‌స్టేషన్ ఎత్తివేతపై జరుగుతున్న ప్రచారానికి స్పష్టమైన ప్రకటన చేసి భయాందోళనలకు తెరదించాలని కోరారు. దీనికి డివిజనల్ రైల్వే మేనేజర్ మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో డివిజన్‌లో 16 రైల్వేస్టేషన్లు ఎంపికయ్యాయని, అందులో పార్వతీపురం స్టేషన్ ఒకటని అన్నారు. రూ.200కోట్లతో ఈ స్టేషన్లన్నీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పార్వతీపురం టౌన్ స్టేషన్ ఎత్తివేతపై తాము ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొన్ని అక్కడ, ఇక్కడ ఆగుతున్న మాట నిజమేనని, రెండు, మూడు, కిలోమీటర్ల దూరంలో సూఫర్‌పాస్ట్ రైళ్లు ఆగి, మళ్లీ వెంటనే బయలుదేరడంతో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురౌతున్నాయని, దీనిపై సాంకేతిక బృంద అధ్యయనం చేసి, ప్రయాణీకులకు ఇబ్బంది కలగకుండా నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. సుమారు రూ10.కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా అత్యంత అధునికమైన కొత్త స్టేషన్ భవనాలతో పాటు, అధునాతన సౌకర్యాలు, పార్కింగ్ స్థలం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి పార్వతీపురం స్టేషన్‌ను ఆదర్శవంతమైన స్టేషన్‌గా మారుస్తామని తెలిపారు.


స్పందన కార్యక్రమం రద్దు

కలెక్టరేట్ : ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ఈనెల 6న రద్దు చేయడం జరిగిందని డిఆర్ఒ జె. వెంకట రావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు భాగస్వామ్యమై ఉండటం వల్ల రద్దు చేశామని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఎన్ఎఫ్‌పిఇ అనుబంధ సంఘ సభ్యుల విజయం

ప్రజాశక్తి-విజయనగరం

తపాలా శాఖ సొసైటీ ఎన్నికల్లో 9 డైరెక్టర్ పదవులకు జరిగిన ఎన్నికల్లో నేషనల్ ఫెడరేషన్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ అనుబంధ సభ్యులు విజయకేతనం ఎగురవేశారు. శనివారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 9 డైరెక్టర్ పదవులను ఎన్ఎఫ్‌పిఇ అనుబంధ సంఘం నాయకులు క్లీన్ స్వీప్ చేసి సత్తా చాటారు.



మల్బర్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, సినీనటి తమన్నా

మల్బర్ షోరూం ప్రారంభం

అలరించిన సినీనటి తమన్నా

విజయనగరం : స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా కొత్త నిర్మించిన పోర్టు సిటీ సెంట్రల్ మాల్ లో ఏర్పాటు చేసిన మల్బర్ షోరూమ్‌ను డిప్యూటీ స్పీకర్ కోళ్లగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పి.సురేషబాబుతో కలిసి సినీనటి తమన్నా బాటియా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షోరూమ్‌లో తిరుగుతూ సందడి చేశారు. అనంతరం తమన్నా మాట్లాడుతూ నాణ్యమైన ఆభరణాలకు మారుపేరు మల్బర్ అని, విజయనగరం ప్రజలు దీన్ని ఉపయోగిం చుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 16వ షోరూమ్ అని, తన చేతులు మీదిగా ప్రాంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆ సంస్థ చైర్మన్ ఆహ్మద్ మాట్లాడుతూ విజయనగరంలో షోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమ సంస్థ నాణ్యమైన బంగారం, డైమాండ్ వస్తువులను ప్రజలకు అందించేం దుకు తాము ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. మొదటి కొనుగోలుదారులు కరణం గంగాధర్ కుటుంబానికి తమన్న చేతులు మీదుగా అందజేశారు. తమన్నాను చూసేందుకు అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు.



అభివాదం చేస్తున్న తమన్నా

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 67 కేంద్రాల్లో నిర్వహణ
- ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 15 నుంచి జరిగే ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేది వరకు మొత్తం 67 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా పరీక్షలు సాఫీగా రాసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నిరంతర విద్యుతు, తాగునీటి కల్పనకు చర్యలు తీసుకున్నామని, కంట్రోల్ రూం ఏర్పాటుచేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, పరీక్షలకు సంబంధించిన సమస్యలకు, సందేహాలకు 08922-237988 నంబరును సంప్రదించవచ్చని సూచించారు. జిల్లాలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 24,469 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 28,726 మంది.. 53,195 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 6 సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. చూసిరాతలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని, పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలని కోరారు.

ఉద్యమాలకు సన్నద్ధం : ఎపిఎన్‌జిఒ

పార్వతీపురం రూరల్: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు ఉద్యోగుల పరిస్థితి రోజు రోజుకు చాలా దయనీయంగా మారుతుందని, కావున సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి సిద్ధం కావాలని ఎపి జెఎసి అమరావతి ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఎపి మున్సిపల్ మినిస్టీరిల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు.. శనివారం స్థానిక ఎన్జీవో హెూంలో జరిగిన ఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు .శ్రీరామ్మూర్తి డివిజి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగుల పట్ల నెలకొన్న పరిస్థితులన్నింటిని ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికార్లకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడంలేదని అన్నారు. కావున భవిష్యత్తులో ఉద్యమించేందుకు ప్రతి ఉద్యోగిని సమాయత్తం చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎపి జెఎసి అమరావతి సలహా సంఘ సభ్యులు నాయకులు కోన ఆంజనేయకుమార్ (చంటి), పి.భానుమూర్తి, ఎస్.నాయుడు బాబు, జిల్లా సహ అధ్యక్షులు మరిపి శ్రీనివాస రావు, ఇతర కార్యవర్గ సభ్యులు, వివిద ఉద్యోగ సంఘాల బాద్యులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఇళ్ల నిర్మాణాల ప్రగతి కనిపించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలోని మంజూరైన ఇళ్ల నిర్మాణాల ప్రగతి స్పష్టంగా కనిపించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సాలూరు అర్బన్ గుమడాం గృహ నిర్మాణ కాలనీ లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాల పురోగతిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునాది స్థాయి నుంచి ఇంటి పైకప్పు స్థాయి వరకు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డిఇ జి.సోమేశ్వరరావును ఆదేశించారు. నిర్మాణాలకు మంచినీటి సౌకర్యం, ఇంటర్నల్ రోడ్లను పరిశీలించారు. లబ్దిదారులకు ప్రభుత్వ కల్పించిన అవకాశాన్ని వినియోగించుకొని త్వరితగతిన ఇళ్లు నిర్మించుకొనేలా గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ అధికారులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన సామాగ్రి సకాలంలో అందించి వేగవంతం చేయాలన్నారు.

టిడ్కో ఇళ్లు పరిశీలన

సాలూరు అర్బన్ టిడ్కో ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను గృహనిర్మాణ శాఖ ఎఇ ప్రవీణ్‌ను ప్రశ్నించారు. 1248 ఇళ్ల నిర్మాణాలకు కేటగిరీ-ఎలో బ్లాక్‌కు 48 ఇళ్ల చొప్పున 24, బ్లాక్ బి కేటగిరీలో రెండు పూర్తయ్యాయని, మరో 48 ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయని ఎఇ తెలిపారు. కాలనీలో రహదారులు, డ్రైనేజీలు నిర్మాణం, తాగునీటి ట్యాంక్‌ను పరిశీలించారు. అనంతరం నాడు నేడు కింద నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు, తహశీల్దార్ కె.భాను పసాద్, ఎంపిడిఒ జి.పార్వతి, గృహ నిర్మాణ శాఖ అర్బన్, రూరల్ ఎఇలు టి.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, ఆసుపత్రి సూపరిండెంట్ డా, వేణుగోపాల్, ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనుబాబు, వైద్యులు రత్న కుమారి, తదితరులు, పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండలంలో వివిధ గ్రామాల్లో పర్యటించారుఉ. ఆమెను గెలిపించాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ చేయాలన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జాయింట్ యాక్షన్ కమిటీ పి. ప్రభాకర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా పబ్లిక్ సెక్టార్ కాపాడుకోవడానికి, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణకు, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్‌పై పోరాడాలంటే ఆమెను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బి అమరవేణి, కార్యదర్శి కాద రాము, శ్రామిక మహిళా సంఘం నాయకులు ఎన్. హిమప్రభ, ఎ. పద్మావతి, వివిధ సంఘాల నాయకులు ఎం. వీరనాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


సీతానగరం: మండలంలోని శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘ నాయకులు రెడ్డి



సీతానగరంలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

శ్వరరావు మాట్లాడుతూ ఈనెల 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రజా సమస్యల పైన ప్రజా ఉద్యమాల పైన కార్మిక ఉద్యోగుల ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. సీతానగరం, లక్ష్మీపురం బూర్జ, పెదంకలాం, వెంకటాపురం, నిడగల్లు, షోరూం పేట తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి వెంకటరమణ, రమణమూర్తి, ఎస్ఎఫ్ఐ నాయకులు నాని, రైతు సంఘం నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రజా సమస్యలపై పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల ఆధ్వర్యాన మండలంలోని కూనేరు సంతలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పైన పోరాడుతున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయుచున్నారని, కావున మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆమె గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రామారావు, నారాయణరావు, లక్ష్మణరావు, శుక్రుడు, చంటి, ప్రసాదు, సుబ్బరాజు పాల్గొన్నారు.



కొమరాడ : కూనేరు సంతలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అందరి నోటా మండలి మాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను..! అందరి నోటా శాసన మండలి ఎన్నికల మాటే వినిపిస్తోంది. యువతలోనూ ఉద్యోగుల్లోనూ, నిరుద్యోగుల్లోనూ, వ్యాపారుల్లోను... ఇలా ఒకటేమిటి కేవలం చదువుకున్నోళ్లే కాకుండా అన్ని తరగతులవారి నోటా ఎమ్మెల్సీ ఎన్నికల మాటే వినిపిస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గరపడ్డాయి. మరో వారం రోజుల్లో అంటే ఈనెల 13వ తేదీనే ఎన్నిక జరుగుతుంది. ఈనేపథ్యంలో అభ్యర్థులు తమ ప్రచార పర్వాన్ని ముమ్మరం చేశారు. వీరిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందంజలో ఉన్నారు. ఆమెకే గెలుపు అవకాశాలు ఉన్నాయని కూడా పలువురు విశ్లేషిస్తున్నారు. ఎన్ని తంటాలు పడినా అధికార, ప్రతిపక్షాలు బలపర్చిన అభ్యర్థులు రెండో స్థానం కోసమేనంటూ నెటిజన్ల సెటైర్లు కూడా వినిపిస్తున్నాయి. ఇంతకీ ఎవరు గెలిస్తే ఏం ఉద్ధరిస్తారు? అని చర్చిస్తున్నవారు కూడా లేకపోలేదు. ఆ మాట కొస్తే వైసిపి బలపర్చిన అభ్యర్థికి అవకాశం దక్కితే ఇప్పటికే ఆ పార్టీ తరపున ఉన్న 42మంది ఎమ్మెల్సీల గుంపులో చేరి అందరి మాదిరిగా భజన చేయడం తప్ప స్వతంత్రత ఉండనే ఉండదు. టిడిపి అభ్యర్థి గెలిస్తే వైసిపి తిట్ల పురాణాన్ని ఎదుర్కోవడం తప్ప, ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు వంటివారి సమస్యలపై ప్రస్తావించే అవకాశం గగనం అన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. అటువంటి నైతక విలువలు కూడా ఆ పార్టీలో కనిపించడం లేదు. అదే మేధావులు చుక్కారామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, డాక్టర్ ఎంవిఎస్ శర్మ వంటివారితో ఆవిర్భవించిన పిడిఎఫ్ (ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) బలపర్చిన అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టం కడితే ఇప్పటి మాదిరిగానే ప్రజల గొంతుకై శాసన మండలిలో వినిపిస్తారు. పాలకపార్టీల ఏకపక్ష ధోరణికి అడ్డుకట్టు పడినట్టుగా కూడా ఉంటుంది. అలా కాకుండా పాలకపక్షాలకు అవకాశం కల్పిస్తే ప్రజావ్యతిరేక విధానాలకు పట్టం కట్టినట్టే. ఈ మాటలు అంటున్నది ఆమె అభిమానులో, బంధువులో కాదు సుమా... ఎంతో మంది విద్యావంతులు, మేథావులు, వర్శిటీల విసిలు, అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్యవాదులు. వాస్తవానికి ప్రభుత్వానికి మంచి సూచనలు, సలహాలు అందాలంటే శాసన మండలిలో రాజకీయాలతో సంబంధం లేని మేధావులు కూడా అడుగుపెట్టాలని రాజ్యాంగం చెబుతోంది. అందులో భాగంగానే ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఒక మంచి మేథావిని ఎన్నుకునేందుకు అవకాశం దక్కింది. ఆ విధంగా శాసన మండలి పున:ప్రారంభం తరువాత రెండు దఫాలు పిడిఎఫ్ తరపున ఎంవిఎస్ శర్మ పోటీచేసి ఘన విజయం సాధించారు. పాదయాత్ర, సైకిల్ యాత్ర వంటి రూపాల్లో ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, గిరిజనులు, మత్స్యకారులు ఇలా అన్ని తరగతులవారిని కలుసుకుని వారి సమస్యలను మండలిలో ప్రస్తావించి పరిష్కరించేవారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని జిల్లా పరిషత్, డిఆర్‌సి వంటి సమావేశాల్లోనూ జనం సమస్యలు చర్చకు తెచ్చేవారు. ఎంతో కొంత జనానికి న్యాయం జరిగేది. గడిచిన ఎన్నికల్లో పాలకపార్టీలన్నీ ఏకమై బిజెపి అభ్యర్థిని గెలిపించారు. గెలిచిన ఆసామీ కనీసం ప్రజాసమస్యలపట్ల ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక ఈసారి అధికార, ప్రతిపక్షాలు కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీకి తెరలేపాయి. ఇందుకు బలమైన కారణాలే కనిపిస్తున్నాయి. అటు శాసన సభలోగానీ, ఇటు శాసన మండలిలోగానీ అధికార, ప్రతిపక్షాలకు చెందిన సభ్యులు ఒకరినొకరు విమర్శించుకోవడం, తిట్ల పురాణాలు తప్ప ప్రజల తరపున చర్చించిన దాఖలాలు దాదాపు లేవనే చెప్పుకోవచ్చు. ఇటువంటి తరుణంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై స్పష్టమైన వైఖరితో మాట్లాడుతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలు మొదలుకుని, రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసే నూతన విద్యా విధానాలు, అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలను విలీనం పేరుతో ఎత్తివేత, జాబ్ క్యాలెండర్ తీయకపోవడం, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగులకు ఇచ్చిన పిఆర్‌సి రద్దు హామీ నిలబెట్టుకోవాలని గట్టిగానే సభలో నిలదీస్తున్నారు. విధాన పరంగా టిడిపిది కూడా ఇదే వైఖరి కావడంతో ఆ రెండు పార్టీలకు పిడిఎఫ్ కంటగింపుగా మారింది. ప్రజాసమస్యలు ప్రస్తావనకు వస్తే ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉందని గ్రహించిన వైసిపి, టిడిపి తమ పార్టీల తరపున అభ్యర్థులను రంగంతోకి దింపాయి. పట్టభద్రులు మాత్రం పిడిఎఫ్ మద్ధతుతో స్వతంత్రంగా పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వైపు మొగ్గు చూపుతున్నారు.



నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు

వీరఘట్టం : ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కిమ్మి పంచాయతీ కార్యాలయంలో శనివారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో నష్టం వాటిల్లింది, వాటిపై పరిశీలన, నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే గ్రామానికి సమీపాన ఏనుగులు సంచరిస్తున్నందున కవ్వింపు చర్యలు చేపట్టరాదని ప్రజలకు సూచించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ పి.రవిబాబు, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు, విఆర్ఒ రఘు కుమార్, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టేందుకు కృషి


మాట్లాడుతున్న ఐద్వా నాయకులు పద్మ

పాలకొండ రూరల్ : బాల్య వివాహాలను అరికట్టేందుకు మహిళలు కృషి చేయాలని ఐద్వా నాయకులు గోరు పద్మ పిలుపు నిచ్చారు. మండలం లోని బుక్కూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, మహిళల ఆరోగ్యం, బాల్య వివాహాలు అరికట్టడానికి మహిళంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎన్.హిమప్రభ, అమరవేణి, ఎ.పద్మ, సచివాలయ మహిళా పోలీస్ బి.జయంతి, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.కమలాజోసు, అంగన్వాడీ వర్కర్ టి.దివ్య, ఆశా వర్కర్ పి.రామలక్ష్మి, ఇందిర, హెల్పర్ పాల్గొన్నారు.

పాఠశాలకు పుస్తకాలు వితరణ


పుస్తకాలను అందిస్తున్న దాతలు

కురుపాం: విద్యార్థులకు పుస్తకాలు ఎంతో విజ్ఞానాన్ని ఇస్తాయని ప్రముఖ కవి రచయిత గంటేడ గౌరు నాయుడు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు నిర్వా పుస్తక మిత్ర విజ్ఞాన ప్రచురణ వారు రూ.36వేలు విలువగల పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పుస్తకాలను అందజేసి పుస్తకం అవసరం, ఆవశ్యకతను వివరించారు. ప్రధానోపాధ్యాయులు రామ గోవింద మాట్లాడుతూ "పుస్తకం మా జీవన నేస్తం" అనే కార్యక్రమం పాఠశాలలో నిర్వహిస్తూ పలు పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, ఇంత విలువైన పుస్తకాలు అందజేసిన బృందానికి పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల చెంతకు కుటుంబ వైద్యుడు


పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

కొమరాడ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సరైన వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యుడు విధానంతో ప్రజల చెంతకు వైద్యం చేరుతుందని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. మండలంలోని కంబవలస సచివాలయ పరిధిలో కుటుంబ వైద్యులు విధానంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైద్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గ్రామంలో ఉన్న పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య తనిఖీలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఇసిజి తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య అవసరాల నిమిత్తం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామ సమీపంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను దూరం పెట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యుల విధానంతో ప్రజలందరికీ వైద్య సేవలు అందించడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఏ చిన్న అనారోగ్యం వచ్చినా తక్షణమే ఆసుపత్రికి వచ్చి వైద్య తనిఖీలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

కొమరాడ : ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని టిడిపి నాయకులు పల్లవీరాజు డిమాండ్ చేశారు. మండలంలోని రామభద్రపురం ఇసుక రీచ్ వద్ద టిడిపి, సిపిఎం, జనసేన నాయకులతో కలిసి శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పల్లవీరాజు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక ఆక్రమ రవాణా జోరుగా జరుగుతుందన్నారు. గతంలో అనుమతులు ఉండేవని, ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం తరపు నుంచి ఎటువంటి అనుమతుల్లేవన్నారు. ఇసుక అక్రమ తరలింపు మానుకోవాలని పలుమార్లు నిరసనలు, ధర్నాలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 3137 మంది ఓటర్లు

కురుపాం: నియోజకవర్గం పరిధిలో గల ఐదు మండలాలల్లో 3137 మంది ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం 582, గుమ్మలక్ష్మీపురం 608, జియ్యమ్మవలస 596, గరుగుబిల్లి 723, కొమరాడ 628 మంది ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరంతా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో పోలింగ్ స్టేషను ఉంటుందని ఎలక్షన్ కమిషన్ సూచించిన ఓటర్ గుర్తింపు కార్డు తీసుకుని ఎఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు మాత్రమే ఓటేసేందుకు సమయం ఉంటుందన్నారు. కావున ఆ సమయంలో పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రహరీ నిర్మించాలని ఎంపిడిఒకు వినతి


ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందిస్తున్న యువకులు

బలిజిపేట : మండలం లోని గలావల్లి ఎస్‌టి వీధికి చెందిన యువకులు తమ గ్రామంలో ఉన్న అంబేద్కర్ భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాలని శనివారం ఎంపిడిఒ భాను మూర్తికు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎంపిడిఒ ఇప్పటికే ఆలస్యమైందని వెంటనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ అంబేద్కర్ భవనంలో ఆ గ్రామ యువకులు గ్రంథాలయాన్ని వినియోగించు కుంటున్నారు. అందులో మూడు కంప్యూటర్లను ఏర్పాటు చేసుకొని దాతలు సహకారంతో అందుతున్న పుస్తకాలను పత్రికలను ఉంచుతూ విద్యార్థులకు నిత్య విద్య భవనంగా ఏర్పాటు చేస్తున్నారు. అయితే భవనానికి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేస్తే సుమారు 40 సెంట్లు రిజిస్ట్రేషన్‌లో ఉన్న ఆ స్థలానికి క్రీడల విషయంలో గాని ఇతర సౌకర్యాలకు అనుకూలంగా ఉంటుందని ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉంటాయని ఎంపిడిఒను యువకులు కోరారు. వెంటనే ఎంపిడిఒ సంబంధిత అధికారులకు ప్రహరీ నిర్మించాలని ఆదేశించడంతో పాటు క్రీడా సామగ్రిని కూడా అందిస్తామని యువకులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో యువకులు బి. వెంకటి, ఎన్. వివేక్, బి. గణపతి, ఆర్. అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

త్వరలో జరుగునున్న పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ డిఇఒ కె.విజయకుమారి ప్రధానోపాధ్యా యులకు ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో లైటింగ్, మంచినీటి సదుపాయం తదితరమైనవి ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి పి. కృష్ణమూర్తి, అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


వీరఘట్టం: మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

పాఠశాలలో బృందాలు తనిఖీలు

మండలంలోని గడగమ్మ, రెగ్యులర్ పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో శనివారం విద్యా బృందాలు ముమ్మర తనికీలు నిర్వహించాయి. రికార్డులు నిర్వహణ మధ్యాహ్న భోజన పరిశీలన, వర్క్ బుక్కులు తదితరమైన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, సిహెచ్ రత్నాకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణతలో తల్లిదండ్రులు పాత్ర కీలకం

కురుపాం : 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతకు విద్యార్థుల తల్లితండ్రులు కీలక పాత్ర పోషించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. శంకర రావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పాఠశాలలో 84 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారని అందరూ కూడా ఉత్తీర్ణత సాధించాలంటే పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా ప్రత్యేకంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకొని ఇంటి వద్ద కూడా చదివించాలని కోరారు. ఈ సమావేశంలో విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాం: తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

6న ఇరిడిలో 'ఇదేం కర్మ'

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 6న మండలంలోని ఇరిడి గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 27 పంచాయతీల్లో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు.

బహిరంగ వేలం

పాలకొండ : నగర పంచాయితీ మార్కెట్‌లో రోజువారీ మార్కెట్ ఆసీలు, వారపు సంతలు, చెట్ల ఫలసాయం, కబేళా, రోడ్డు మార్జిన్ల వ్యాపారుల రోజువారీ కలెక్షన్ మొదలైనవి వసూలు చేసుకోవడానికి 2023-24 సంవత్సరానికి సంబందించిన బహిరంగ వేలం కమీషనర్ సామంచి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నగర పంచాయితీ ఆఫీసు ప్రాంగణంలో జరిగింది. ఇద్దుబోయిన మహేష్ రూ. 7.80లక్షలకు పాటను దక్కించుకున్నారు. సదరు పాట మొత్తం గత మూడు సంవత్సరాల కిస్తీ సరాసరి సుమారు 30 శాతం అదనంగా వచ్చింది. కౌన్సిల్ ఆమోదంతో ఉత్తర్వులు జారీ చేస్తామని కమిషనర్ తెలిపారు. ఆసీలు వసూళ్ళు నగర పంచాయితీ వారి నియమావళిని అనుసరించి చేపట్టాలన్నారు. నిబంధనల మేరకు పాట మూడునెలల కిస్తు 1.95లక్షలు ఈనెల చివరిలోపు నగర పంచాయితీకి చెల్లించి ఏప్రిల్ ఒకటి నుంచి వసూళ్ళు చేసుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శనివారం సాయంత్రం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు బి.జోగినాయుడు, ముక్తేశ్వర పాణిగ్రహి, జిల్లా కార్యదర్శి ఎంవి గౌరీశంకర్ రావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఐపిఎస్ పునరుద్ధరించాలని కోరారు. పాఠశాలల్లో బోధనకి ఆటంకంగా వున్న 12యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో 3,4,5తరగతుల విలీనాన్ని నిలిపివేయాలని కోరారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ ఎ.ప్రవీణ్ కుమార్, ఎటిటిఫ్ మండల నాయకులు ఎ.చంద్రశేఖర్, ఎ.సన్యాసిరావు, పాల్గొన్నారు.

ఉద్యోగ వ్యతిరేక చర్యలు మానుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక చర్యలను మానుకోవాలని మన్యం జిల్లా యుటిఎఫ్ నాయకులు తోట రమేష్ కోరారు. గుమ్మలక్ష్మీ పురంలోని గిరిజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, కేజీబీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీస వేతనం కోట ఇవ్వటం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వీరికి వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్ డిఎ కూడా వీరికి వర్తింపజేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని, వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిఎలకు 10 నెలల వేతనం కాకుండా 12 నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా పురుషులకు 22 రోజులు, స్త్రీలకు 27 రోజులు సెలవులు ఇవ్వాలని అన్నారు. గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని, అరకొర జీతాలు కాకుండా పూర్తిస్థాయిలో జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిసిసి ఉద్యోగులను 62 ఏళ్లకు రిటర్మెంట్ వయసు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మండంగి రమణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, నాయకులు పువ్వల మోహన్ రావు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల రిటైర్మెంట్ వయసు పెంచాలి

కొమరాడ : ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజల వద్దకు తీసుకెళ్లేది ఉద్యోగులేనని, అందులో ప్రధానమైన విద్యారంగంలో పనిచేయుచున్న ఉద్యోగులతో పాటు సచివాలయ, ఇతర ఉద్యోగులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా గిరిజన, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న, కెజిబివి పాఠశాలల్లో పనిచేయుచున్న పార్ట్ టైమ్ టీచర్లకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. వారి కేడర్‌ను బట్టి ఎంటిఎస్ అమలు చేయాలని, గిరిజన సంక్షేమ, ఆశ్రమ, సంక్షేమ, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లలోనూ, కెజిబివిల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వీరిలో పురుషులకు 22, మహిళలకు 27 సెలవులు ఇవ్వాలని కోరారు. గ్రామ సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రమోషన్లకు అవకాశం కల్పించాలని, వేతనాల స్కేల్ పెంచాలి కోరారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు సాంబమూర్తి పాల్గొన్నారు.

విత్తన బంతుల తయారీ : ఎఒ

ప్రజాశక్తి - పాచిపెంట

పోడు వ్యవసాయ పద్ధతుల్లోనూ, వర్షాధార భూముల్లో పండించే పంటలకు సంబంధించిన విత్తనాలను ముఖ్యంగా చిరుధాన్యాలైన జొన్నలు, గంటెలు వంటి విత్తనాలను బంతులుగా తయారు చేసుకుని ఆరు నెలల తర్వాత కూడా పొలంలో చల్లుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని మాతుమూరులో దావులూరి బాలకృష్ణ వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ మండల కో-ఆర్డినేటర్ బాలకృష్ణ ద్వారా తయారు చేయించిన విత్తన బంతులను పరిశీలించారు. నీటి సదుపాయం లేని భూముల్లో పూర్తిగా వర్షాధారంపై ఆధార పడ్డ భూముల్లో ముఖ్యంగా పోడు వ్యవసాయ భూముల్లో విత్తన బంతులను చల్లుకుంటే అదునుకు వ్యవసాయం చేసుకునే వీలవుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యం ఐసిఆర్‌పి రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్, రైతులు పాల్గొన్నారు

విత్తన బంతుల తయారీ విధానం:

నాటుటకు కావాల్సిన విత్తనాలను ముందుగా బీజామృతంతో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత విత్తనాలను ఒక గోనెసంచిపై వేసి కావాల్సినంత నీటిని చిలకరిస్తూ మెత్తటి బంకమట్టిని చల్లుకోవాలి. ఆ తర్వాత మెత్తగా తయారు చేసి ఉంచిన ఘనజీవామృతాన్ని చల్లుతూ నీటిని చిలకరిస్తూ ఉండాలి. మూడో పొరగా మెత్తటి బూడిదను చల్లి గోనెసంచెను రెండు వైపులా పట్టుకుని ఊపుతూ ఉంటే విత్తన బంతులు తయారవుతాయి. ఈ విత్తన బంతులు ఆరు నెలల వరకు జీవం కోల్పోకుండా ఉంటాయి.


విత్తన బంతులను తయారు చేస్తున్న రైతులు

విత్తన బంతుల ఉపయోగాలు

విత్తన బంతుల్లో వాడిన ఘనజీవామృతం బయోఎనాక్యులంగా ఉపయోగపడి మొలక శాతం దెబ్బ తినకుండా చూస్తుంది. బీజామృతంతో శుద్ధి చేయడం వల్ల హార్మోన్లు అంకురం ఉత్పత్తికి సిద్ధంగా ఉంచుతాయి. బూడిద, బంక మట్టి విత్తనంలో తేమ స్థాయిని నియంత్రించి 8 నుంచి 12 శాతం తేమ ఉండేలా చూడడం వల్ల విత్తనం ఎక్కువ కాలం స్వచ్ఛ కోల్పోకుండా ఉంచుతుంది.

కుడివైపు తీసి ఎడమవైపు వదిలేశారు..

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

తోటపల్లి కురుపాం రహదారి విస్తరణ పనులలో భాగంగా పెదమేరంగి జంక్షన్‌లో కుడి వైపున రహదారికి అనుకూలంగా విస్తరణ పనులు చేపట్టారు. రహదారికి ఆనుకుని ఉన్నటువంటి బిల్డింగులు షాపులు పూర్తిగా తీసివేశారు. ఎడమవైపు వచ్చేసరికి మలుపులో విస్తరణ పనులు తగ్గించి చేయటంతో కురుపాం నుంచి పార్వతీపురం వైపు వెళ్లే వాహనాలు, పార్వతీపురం నుండి కురుపాం వెళ్లే వాహనాలు మలుపు వద్ద ఎదురెదురుగా కనిపించే అవకాశం లేదు. వాహనాల రాకపోకలలో కనిపించకపోవడం వల్ల ఢీకొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్థానిక ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒరిస్సా వెళ్లే భారీ వాహనాలు ఈ రహదారి గుండా నిత్యం వెళ్తున్నాయని విస్తరణ జరిగాక మరిన్ని ఎక్కువ భారీ ట్రాన్స్‌పోర్టు వాహనాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని దీనివల్ల మలుపు వద్ద ఎడమవైపు విస్తరణ సరిగా జరగకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని అంచనా వేస్తున్నారు. మలుపు వద్ద పూర్తి విస్తరణ చేయకుండానే కాలువ పనులు నిర్వహించడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. ఎడమవైపు పూర్తిస్థాయిలో విస్తరణ చేపట్టి మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే విధంగా రహదారి పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఈ మలుపు వద్దే ఎడమ వైపు విస్తరణ చేపట్టాలి

సింహ ద్వారం ప్రారంభం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని లివిరి గ్రామంలోని చారిత్రక దేవాలయం శ్రీ రాధ గోపినాధ స్వామి ఆలయానికి ప్రతీకకగా గ్రామ రహదారి అగ్రభాగన నిర్మించిన సింహ ద్వారాన్ని ఎమ్మెల్యే విశ్వాసారాయి కళావతి శనివారం ప్రారంభించారు. పురాతనమైన చారిత్రక నేపథ్యం కలిగి ఒరిస్సా, ఆంధ్రా వాసులు కొలిచే శ్రీ రాధా గోపినాధ స్వామి ఆలయ సింహ ద్వారం నిర్మాణంలో తనకు భాగస్వామ్యం కల్పించినందుకు ఆలయం కమిటీ సభ్యులకు, గ్రామస్థులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజక వర్గ వైసిపి పరిశీలకులు డోల జగన్, ఎమ్మెల్యే లివిరి గ్రామంలో పర్యటించి, స్థానిక సమస్యలు, ఆలయ యాత్ర మహోత్సవాలు, పార్టీ మరింత బలోపేతం అంశాలు పై స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, మాజీ జెడ్‌పిటిసి సోమరాజు గోపాలరావు, లివిరి సర్పంచ్ బౌరి సౌదమిని, పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి రమేష్, జెసిఎస్ కన్వీనర్ కొత్తకోట చంద్రశేఖర్, టింగ అన్నాజిరావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


సింహ ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

రాజకీయ పార్టీలు సహకరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహశీల్దార్ జె.రాములమ్మ కోరారు. శనివారం తన కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు ఎవరైనా సరే 100 మీటర్ల లోపు మాత్రమే ఉండాలన్నారు. ఓటు వేసేందుకు అభ్యర్థులు ఒంటరిగానే వెళ్లి సక్రమంగా ఓటునువినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల అవతల వైపే వాహనాలను ఆపాలని, పార్టీల టెంట్లు, శిబిరాలు కూడా అదే దూరంలో ఉండాలని అన్నారు. శిబిరాలలో ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులను మాత్రమే ఉంచాలన్నారు. వికలాంగ ఓటర్లతో ఒక్క వ్యక్తి మాత్రమే తోడు ఉండి పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్ళేటట్లు పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఈ సమావేవంలో ఎంపిపి కె. దీనమయ్య, ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, ఎఎస్ఐ శంకర్రావు, జనసేన పార్టీ నాయకులు కే. మల్లేష్, బిజెపి మండల కన్వీనర్ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రాములమ్మ

షెడ్యూల్ ప్రకారం టీకాలు

ప్రజాశక్తి - సీతానగరం

వైద్య సిబ్బంది సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం పక్కాగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. మండలంలో మరిపివలస, ఇప్పలవలస, చెల్లంనాయుడువలస, కృష్ణారాయపురం గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన చిన్న పిల్లల టీకా కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించార. టీకా అర్హుల జాబితా, ఏ టీకాలు వేస్తున్నది, సంబంధించిన టీకా కార్డులను, రికార్డులను పరిశీలించారు. ప్రతీ టీకా యొక్క వివరాలు రికార్డుల్లో పక్కాగా ఉండాలని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. టీకా కార్యక్రమంలో నిర్దేశించిన అన్ని సూచనలు పాటించాలని, వ్యాక్సిన్ వయల్ పై ఇచ్చిన సమయం, తేదీ, నమోదు చేయాలని, క్యారియర్‌లో ఇస్ ప్యాక్ స్థితిని పరిశీలించాలని సూచించారు. టీకా కేంద్రంలో అత్యవసర మందుల కిట్ ఉంచాలని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతంపేట

ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన్ స్వల్ప కాలిక కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నటుఉల ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ టివి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పిఎంకెవివై 4.0 సారథ్యంలో స్కిల్‌హబ్ ఇనిసియాటివ్ కార్యక్రమం' ద్వారా తమ కళాశాలను ట్రైనింగ్ సెంటర్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇందులో భాగంగా ఉచిత స్వల్పకాలిక శిక్షణా తరగతులు కోసం అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, ఫోర్ వీలర్ సర్వీస్‌అసిస్టెంట్, అసిస్టెంట్ ప్లంబర్, సీయింగ్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల బయోడేటాతో పాటు విద్యార్హత ధృవపత్రాలు, 2 పాస్ ఫోటోస్, ఆధార్ లింక్ మొబైల్‌తో పాటు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు 6304033963 , 9948582309లను సంప్రదించాలని కోరారు.


పిల్లలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కమర్

పాఠశాలలో మెడికల్ క్యాంపు

సీతంపేట : మండలంలోని పూతికవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శారద తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యునికి పరామర్శ

కురుపాం : స్థానిక కురుపాం మేజర్ పంచాయతీ 14వ వార్డు సభ్యుడు కందుల బాల ఇటీవల విద్యుత్ షాక్‌కి గురైనట్లు తెలుసుకున్న జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, జెడ్‌పిటిసి సుజాత శనివారం సాయంత్రం ఆయన ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని ఎటువంటి అవసరం వచ్చిన తమకు తెలియజేయాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

పంచాయతీ కార్యదర్శి మృతి

జియ్యమ్మవలస : మండలంలోని అంకవరం పంచాయతీ కార్యదర్శి గజలక్ష్మి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె అనారోగ్యంతో పార్వతీపురంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆమె మృతి పట్ల పంచాయతీ కార్యదర్శి సంఘం నాయకులు బి. రామకృష్ణతో పాటు పంచాయతీ కార్యదర్శులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జెడ్‌పిటిసి ఎం శశికళ, ఎంఎస్ఎంఎ డైరెక్టర్ ఎం గౌరీ శంకర్ రావు, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్ సంతాపాన్ని వ్యక్తం చేశారు

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

పాచిపెంట : మండల కేంద్రం కూరాకుల వీధికి చెందిన కోట ఎర్రయ్య (43) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రయ్య గత 8 ఏళ్లుగా మతిస్థిమితం లేక వ్యాధి నివారణ కోసం రోజు మందులు వేసుకుంటున్నాడు. ఫిబ్రవరి 24న రోజువారి వేసుకోవలసిన మోతాదు కన్నా ఎక్కువ మోతాదులో మందులు తీసుకోవడంతో స్పృహ కోల్పోయాడు. దీంతో కుటుంబీకులు విజయనగరం ఎంఆర్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కృపారావు తెలిపారు.

ఆచూకీ తెలపండి

జియ్యమ్మవలస: పార్వతీపురానికి చెందిన కోల మోహన్ కృష్ణ కనిపించడం లేదంటూ తన భార్య తులసిరాణి ఫిర్యాదు చేసినట్లు చిన్న మేరంగి ఎస్ఐ జి. కళాధర్ తెలిపారు. తమ బంధువుల ఇంట్లో వివాహ వేడుకలకు ఈనెల 1వ తేదీన చిన్న మేరంగి గ్రామానికి తన కన్నవారింటికి వచ్చామని 2తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో తమ బంధువులను బస్సు ఎక్కించి వస్తానని చెప్పి బస్టాండ్‌కు వెళ్లాడని, తిరిగి అక్కడనుండి రాలేదని ఆమె పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. తమ బంధువుల ఇతర ఇళ్లల్లో వెతికినా ఎక్కడ ఆచూకీ లభించలేదని చెప్పారు. అతని ఆచూకీ తెలిస్తే చినమేరంగి పోలీసులకు తెలియజేయాలని, 9121109478 నెంబర్ కు సమాచారాన్ని అందివ్వాలని ఎస్ఐ కోరారు.